గోడమీది రాతలు

సామాను ఎక్కించటం పూర్తయింది. లారీలోంచి బీరువా, డ్రెస్సింగ్ టేబిల్, సైకిల్‌వగైరాలన్నీ తలెత్తి బయటి ప్రపంచాన్ని చూస్తున్నాయి.

కాలుస్తున్న బీడీని చివరిసారి పీల్చి బయటకు విసిరేస్తూ అడిగాడు రహీమ్– "అంతా అయినట్లేనా సార్?"

"ఆ..." అని సమాధానం ఇచ్చాను.

లారీ కాబిన్ సీట్లు తుడిచి రహీం, ప్రయాణానికి సిద్ధం చేస్తున్నాడు. వాణి ఇంట్లో పిల్లలకు బూట్లు వేస్తోంది. పిల్లలు ఇద్దరూ కొత్త ఇంటిమీద ఉత్సాహంతో ఉన్నారు. లేకపోతే ఇంత తేలికగా ఏ పనీ చేయటం అలవాటు లేదు వాళ్ళకు. మొండితనం, అల్లరి, పెంకితనం వీటితో బాటు కొంత గారం, ఇవన్నీ అయేసరికి వాళ్ళలో కొంచెం మాట వెంటనే వినని తత్వం పెరిగింది వాణి బి.ఎడ్, పాసయింది. బి.ఎడ్‌లో ఛైల్డ్ సైకాలజీ కూడా ఓ పాఠ్యాంశమే! కానీ వాణికి బొత్తిగా పిల్లల్ని ఎలా పెంచాలో తెలీదు అనుకున్నా.

బూట్లు వేసుకొని సరోజ నా దగ్గిరకొచ్చి అడిగింది "నాన్నా, లారీ ఎక్కి కూర్చోనా?

"ఎక్కండి" అన్నాను.

సరోజ లారీ ఎక్కబోయింది. మళ్ళీ ఏమనుకొందో ఏమో దిగిపోతూ అంది "నాన్నా! ఒన్‌మినిట్ నాన్నా, మా ఫ్రండ్స్ అందరికీ చెప్పి వస్తాం!"

నవ్వుతూ "వెళ్ళం" దన్నాను.

సరోజ పరిగెడుతూంటే కూడా ప్రతిమా పరిగెట్టింది. వాణి ఇంట్లోంచి బయటికొచ్చి అడిగింది "మళ్ళీ వీళ్ళిద్దరూ ఎక్కడికండీ దారితీశారు?"

"ఫ్రెండ్స్‌కి చెప్పి వస్తామన్నారు!"

వాణి నాలుక కొరుక్కొంది. "నువ్వు చెప్పిరా!... పర్వాలేదు. వెళ్ళిపోలేదుగా మనం!" అన్నాను వాణికి కొంచెం మానసికంగా బలాన్నిస్తూ.

వాణి వెళ్ళింది. రహీం ఇంజన్ బానెట్‌తీసి ఏదో చూస్తున్నాడు.

ఇంకా కొన్ని నిమిషాల టైముంది.

ముగ్గురు ఆడవాళ్ళు తలోదారిన స్నేహితులనుంచి వీడ్కోలు తీసుకునేందుకు వెళ్ళారు. అంత త్వరగా వస్తారనే నమ్మకం, ఆశా లేదు.

ఇంట్లో ఏమీ మర్చిపోలేదుకదా, అనిపించింది. ఊరికే కూర్చోటం దేనికని ఇంట్లోకి నడిచాను.

నిన్నటినుంచీ ఇంట్లోని సామాన్లన్నీ సర్దుతున్నాం. దాదాపు ఎనిమిదేళ్ళనుంచీ ఉంటున్న ఇల్లు ఖాళీ చేయాల్సి వస్తోందంటే బాధగా వుంది. ఇంటి వాళ్ళన్న పేరేగానీ సోమయాజులుగారితో ఎప్పుడూ ఏ పేచీ ఉండేదికాదు. ఒకే ఊరిలో ఉంటున్నా ఎప్పుడూ ఆయన ఇటుకేసి వచ్చిన గుర్తు లేదు. నెల నెలా బ్యాంక్ ఎకౌంట్‌లో అద్దె ఎంతో అంతా కట్టేస్తేసరి! అక్టోబర్‌నెల మొదట్లో మాత్రం ప్రతీ ఏడాదీ వచ్చేవారు. దగ్గరుండి ఇల్లు అంతా సున్నం కొట్టించేవారు. "వచ్చేవన్నీ పండుగలు. దసరా, దీపావళీ, నాగుల చవితి, సంక్రాంతి, ఉగాది – అందుకే ఇల్లంతా శుభ్రంగా ఉండాలి!" అనేవారు.

– సోమయాజులుగారుపోయి అపుడే నాలుగేళ్ళు కావస్తోంది. ఆయన పోగానే ఇంటి పెత్తనం రవీంద్రకు వచ్చింది. తండ్రికి పూర్తి విరుద్ధం తను. నాలుగేళ్ళు అయిందేమో, సున్నం కొట్టించి. మొదటి ఏడాది తండ్రి పోయారని కొట్టించలేదు. తరువాత ఒకసారి కనపడితే అడిగాను. "ఇంటికోసారి సున్నం వేయిస్తే....!" అని. రవీంద్ర నవ్వాడు. "వేశ్యకు ఇచ్చిన డబ్బులు, ఇంటికి కొట్టిన సున్నం తిరిగిరావు అని సామెత! అయినా ప్రతి ఏడాదీ దేనికండీ సున్నం?" అన్నాడు తేలికగా.

పండిత పుత్ర: పరమ శుంఠ: అన్నారు. తండ్రీ కొడుకులే అయినా ఎంత తేడా!

ఎనిమిదేళ్ళనుంచీ ఉంటున్నాం కనుక అద్దె ఏకంగా వందల్లో పెంచే అవకాశం లేదు. బహుశా అందుకే కాబోలు, ఇల్లు ఖాళీ చేయండన్నాడు. కొత్త ఇల్లు వెతికి పట్టుకొనేసరికి రెండు నెలలపైనే పట్టచ్చు. అద్దె కనీసం వంద పెరుగుతుంది. "ఆ వందా వీళ్ళకే పారేస్తే సరి. ఇక్కడే ఉండొచ్చు" అంది వాణి. అర్థంలేని మాటలు! – 'అద్దె పెంచటం కాదు. ఇల్లు ఖాళీ చేయండ'న్నాడు రవీంద్ర. ఇల్లు వాళ్ళది కనుక, మాటా వాళ్ళదే చెల్లుతుంది!

– చెల్లుతోంది కూడానూ.

– ముందుగదిలో పాత జోళ్ళు వగైరాలన్నీ చిందరవందరగా ఉన్నాయి. ఇంతకు పూర్వం ఇవన్నీ ఎక్కడ ఉండేవి? ఏమో–టేబిల్ ఉండేది కనుక దానికింద ఉండేవికాబోలు!! విరిగిపోయిన సామాన్లు గదిలో చిందరవందరగానే ఉన్నాయి. ఆ చెత్త అంతా తప్పుకొంటూ పక్కనించి కదిలాను.

వెనకగదే మాకు బెడ్‌రూం, లివింగ్‌రూం, డైనింగ్ రూం అన్నీనూ! గదంతా ఇప్పుడు ఖాళీగా ఉంది.

ఆ గది ఇంత పెద్దదని ఇంతక్రితం నాకు తెలీదు. ఒక పక్కన డబుల్ కాట్స్, మరోపక్క బీరువా, బీరువాకు, మంచాలకు మధ్యన డ్రెస్సింగ్ టేబిల్.... అన్నీ కిక్కిరిసి ఉండేవి. ఇప్పుడు గదంతా ఖాళీ. డ్రెస్సింగ్ టేబిల్ పక్కనే ఓ కాలెండర్ ఇప్పుడు నేలమీద ఉంది. కాలండర్ అక్కడ తరచు మారుతూ ఉండేది. ఇంట్లో ఇంకొక చోట– ఎక్కడా కనపడని టేస్టు అంతా అక్కడే కనపడేది నాకు. వారం, మహా అయితే పదిరోజులకొకసారి ఓ కాలండర్ వచ్చిపోయేది.

– కారణం ఇప్పుడు అర్థం అవుతోంది. ఆ కాలండర్ ఉండే స్థలంనిండా కాటుక మరకలు. అంటే డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చొని అలంకరణ యజ్ఞంలో నిమగ్నమయి ఉన్నప్పుడు కంటికొనలకు కాటుక దిద్దాక ఏం చేయాలో తోచక ఆ చేతిని కాలండర్‌కో, ఆ కింద గోడకో రాసేవారన్నమాట!! కాలండర్ కొంచెం పాతబడగానే, నేను కేకలేస్తానని నాకు తెలియకుండా కాలండర్ మార్చేవారన్నమాట!

నవ్వొచ్చింది నాకు.

–కానీ గోడంతా నల్లని మరకలు! చూస్తోంటే ఎవరో కొత్తగా పెయింటింగ్ నేర్చుకుంటూ గీసిన గీతల్లా ఉన్నాయి. ఇవన్నీ బొట్ల రంగులు కాబోలు!!

– ఇల్లన్నాక ఎంత నీటుగా ఉండాలి! అయినా ఎంత చెత్త చేశారు! అక్కడ ఒక్కచోటే

కాదు, ఇల్లంతా గీతలు, రాతలు ఎన్నో ఉన్నాయి. ఇంత క్రితం పరిశీలించలేదు కాబట్టి తెలీలేదు. ఇప్పుడు తెలుస్తోంది.

డ్రెస్సింగ్ టేబిల్ పక్కనే, గోడమీద వాణి వేసిన కొలతలు, మూడు అడుగుల నుంచి ఆరున్నర అడుగులవరకు అంగుళం అంగుళానికి గీతలు. "పిల్లలు పెరుగుతున్నారో లేదో తెలుసుకోవాలంటే ఇదే చిట్కా!" అంది వాణి ఆ రోజున. నాకు నవ్వొచ్చింది. "ఏమీ తోచటంలేదని చెప్పు, ఒప్పుకుంటాను. అంతే కానీ ఇలా గోడలంతా గీతలు గీస్తే కానీ పిల్లల పెరుగుదల తెలీదా ఏం!" అన్నాను.

వాణి క్షణం ఊరుకుని అంది – "పోన్లెండి, అలాగే అనుకోండి! సరేకానీ, ఇలా రండి, మాట, మీకూ, నాకూ ఎంత తేడాయో చూద్దాం!"

వెళ్ళాను. పక్కన నిలబడ్డాను. నెత్తిమీద అట్టకాడ పెట్టి గోడమీదకు గుర్తుపెట్టింది. తర్వాత తను నిలబడింది. నేనూ అలాగే గుర్తు పెట్టాను. నా కన్నా వాణి నాలుగు అంగుళాలు చిన్నగా ఉంది. "నాలుగు అంగుళాలా! అంత ఉండదు! ఈ కొలతలు తప్పుగా గీసినట్లున్నారు" అంది వాణి తను అంత పొట్టి అని ఒప్పుకోవటానికి ఇష్టపడక.

"రా, కావాలంటే పక్కన నిలబడి చూస్కో! నువ్వు ఎలాగైనా పొట్టిదానివే" అన్నాను.

వాణి దగ్గరకు వచ్చి నిలబడింది. పెళ్ళయి ఏడేళ్ళు దాటినా వాణి పక్కన నిలబడితే ఇంకా గిలిగింతే. "మీకన్నా నేను పొట్టే...." అంటూ వాణి యింకా ఏదో చెప్తోంది. నేను వినలేదు. ఆ రోజు ఆఫీసుకు నాగా!!

గుర్తుకొచ్చి నవ్వుకున్నాను.

– డ్రెస్సింగ్ టేబిల్ పక్కన పిల్లల పుస్తకాలు పెట్టుకొనే అలమారు వుంది. ఆ అలమారు లోపల ఎన్నెన్నో బొమ్మలు ఉండేవి. గోడమీదంతా పుస్తకాల్లోని రంగు రంగు బొమ్మలు అంటించి ఉంచారు.

– ఆ రోజు నేను ఆఫీస్‌నుంచి వచ్చేసరికి పిల్లలు ఇద్దరూ టేబిల్‌మీద కూర్చొని గోడమీద కాగితాలు అంటిస్తున్నారు. గమ్ బాటిల్ ఒంపేసి ఉంది ఒక పక్కన, మరో పక్కన కత్తెరతో ఇంట్లో ఉన్న పుస్తకాల్లోని రంగురంగు కాగితాలన్నీ జాగ్రత్తగా చింపి పోగులు పెడుతున్నారు. నాకు ఒళ్ళు మండిపోయింది.

– పుస్తకాలు చింపటం ఎంత చెడ్డ అలవాటు! ఇలా పుస్తకాలన్నీ చింపుకొంటే ఎలా? ఎప్పటికి వస్తుంది వీళ్ళకు బుద్ధి? పైగా చింపుతున్నవన్నీ రీడర్స్ డైజెస్ట్ పుస్తకాలు! అవంటే ఎంత ఇష్టం నాకు!

పట్టరాని కోపం వచ్చింది నాకు – "చేస్తున్న చెత్తపని ఇదా! చదువూ, సంధ్యా లేకుండా!" అంటూ ఇద్దర్నీ చెరో నాలుగు వడ్డించి కూర్చోపెట్టాను.

బిక్కమొహాలు వేసుకొని సరోజా, ప్రతిమా ఓ మూల కూర్చుని ఏడుస్తున్నారు.

"ఏదీ? ఆ మహారాణిగారు?" అనడిగాను.

"అమ్మ కూరలకు వెళ్ళింది" అన్నారు వాళ్ళు.

వాణికి కొంచెం గట్టిగా చెప్పాలనిపించింది. పిల్లలు ఏం చేస్తున్నారో పట్టించుకోకపోతే ఎలాగ అని!

వాణి వస్తోందని ఆ జోళ్ళ చప్పుడుతోనే తెలుస్తోంది. అడుగు నుంచి అడుగు ఎత్తి వేయక నేలకు జోళ్ళను రాస్తూ వస్తుంది వాణి. రాగానే విరుచుకుపడ్డాను. "ఏవిటిదంతా?" అని. పిల్లలకు మంచి అలవాట్లు నేర్పకపోతే ఎలా? అని అడిగాను. బొత్తిగా ఇలా అశ్రద్ధ చేస్తే ఎలా అన్నాను. అన్నీ వింది రాణి. పిల్లలను కొట్టానన్న సంగతి గ్రహించింది. ఏమీ అనలేదు. వెళ్ళిపోయింది వంటింట్లోకి. అన్నం తినేసి, రాత్రి పడుకొన్నాక పక్కకి చేరాక అంది "పిల్లలండీ వాళ్ళు, ఏ అల్లరీ చేయకుండా ఉండాలంటే ఎలా? వాళ్ళకూ కొంచెం స్వేచ్ఛ ఉండాలా, వద్దా? అది చెయ్యొద్దు, ఇది చెయ్యొద్దు అనటమే అయితే ఎలా? ఇంట్లో మిలటరీ కాంప్ పెట్టకూడదు. ఏదో చూసీచూడనట్లు ఉండాలి కానీ ఇలా వద్దండీ, ఆలోచించండి మీరే!"

వాణి బి.ఎడ్. చదువు నాకు ఇప్పుడు అర్థమయింది. నిజమే, ఇంట్లో వాళ్ళు ఏమీ చేయకూడదంటే, తప్పే. గోడలమీద రాయకూడదు. గోడలమీద కాగితాలు అంటించరాదు. గోడలకు మేకులు అసలే కొట్టకూడదు! అన్నీ కూడదే! మరి ఎలా? ఇంకేం అల్లరిచేయాలి వీళ్ళు? ఆలోచిస్తోంటే తోస్తోంది. ఇంట్లో నేనో పెద్ద సైన్యాధ్యక్షుడిలా ఉంటున్నానని. ఇంట్లోనివాళ్ళంతా సైనికుల్లాగానే ఉంటున్నారు. ఎటొచ్చీ నేను ఉంటున్నంతసేపూ. నేను ఇంట్లోంచి బయటకు కదలగానే ఇల్లు ఎలా ఉంటుందో నా ఊహకు అందుతూనే ఉంది. నవ్వొచ్చింది.

"సారీ వాణీ - తప్పు నాదే!"

"పోనీండి- ఏదో పిల్లలు - చూసీచూడనట్లు పోవాలి, అంతేకానీ" అంది వాణి. "పైగా వాళ్ళు చింపిన కాగితాలు నేను ఇచ్చినవే. రీడర్స్ డైజెస్ట్‌లో అడ్వర్టయిజ్‌మెంట్ ఉన్న పేజీలే తీసి ఇచ్చాను. అవే అంటించుకున్నారు. ఇక గమ్ అంటారా? ఏదో ఒలికిపోయి ఉంటుంది" అంది వాణి.

పిల్లలకేసి చూశాను. ఇద్దరూ ఒకరిమీద ఒకరు చెయ్యి వేసుకొని పడుకొని ఉన్నారు. నిద్రలో ఎంతటి ప్రశాంతత! నాకు జాలివేసింది. అనుకోకుండా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మర్నాడు లేవగానే అన్నాను. "ఇదుగో, మీరు పుస్తకాలు పెట్టుకునే అలమారులో మీ ఇష్టం ఏమైనా చేసుకోండి! అంతేకానీ ఇల్లంతా కాగితాలు అంటించద్దు. సరేనా?" అన్నాను. దానికి పర్యవసానం ఈ రంగురంగుల కాగితాలు గోడనిండా!

తలుపు వెనుక ఏమైనా ఉండిపోయాయేమో అని తలుపు తీసి చూశాను. ఏమీ లేవు. కానీ గోడమీద అన్నీ అక్షరాలే! చిన్న చిన్న అక్షరాలనుంచీ తాటికాయలంత అక్షరాలు 'ఎ' నుంచి 'జీడ్' వరకూ. కొన్ని బొమ్మలు, బొమ్మలకింద కాట్, రాట్, డాగ్ అని ఆ బొమ్మల పేర్లు. ఆ పేర్లు లేకపోతే వాటిని గుర్తుపట్టటం కష్టం! - బొమ్మలన్నీ కొంచెం మాసిపోయి ఉన్నాయి.

పిల్లలకేసి చూశాను. ఇద్దరూ నిద్రపోతున్నారు. కోపం కొంచెం తగ్గింది కానీ, వాణిని మాత్రం అడిగాను. "ఏమిటి ఇదంతా?"

"ఎలిమెంటరీ స్కూల్!" అంది వాణి నవ్వుతూ.

"అంటే?"

"అంటేనా! ఈ రోజు పిల్లలు ఇంట్లో స్కూలు పెట్టారు ప్రతిమ టీచర్‌ట. చేతిలో బెత్తం పట్టుకొని పిల్లలందరి మీదా ఒకటే అజమాయిషీ, అందర్నీ సరిగ్గా చదవమంటూ మన ప్రతిమ అక్షరాలు రాసింది, గోడమీద!" అంది వాణి.

నాకు చిర్రెత్తుకొచ్చింది. "అంటే అప్పుడు నువ్వు ఇక్కడే ఉన్నావన్నమాట!

"ఆ- చూస్తోంటే ఎంత ముద్దొచ్చిందో చెప్పలేను."

"ఏడవలేకపోయావ్! పిల్లలు అల్లరి చేస్తోంటే ముచ్చట వేసిందిట. చెప్పటానికి సిగ్గులేకపోతేసరి!"

"పిల్లలు అల్లరి చేయకపోతే నేను చేస్తానా ఏమిటి?" అంది వాణి.

"చూడు, గోడంతా ఎంత ఖరాబయిందో!"

"అవును. అయింది. తలుపువెనకే కదా రాశారు అని ఊరుకున్నాను."

"ఛీ ఛీ, పిల్లలు పాడు చేస్తోంటే ఎలా ఊరుకొన్నావ్?"

"దానివల్ల కొంపేమీ మునిగిపోలేదు."

"మురికి అయింది కదా!" అన్నాను తీవ్రంగా. వాణి ఏమీ అన్లేదు. ఆ అనకపోవటంతో ఆ రోజంతా ఇద్దరమూ ఏమీ మాట్లాడుకోలేదు. ఆ తర్వాత రోజున ఇంట్లోంచి బయటకొస్తూంటే వాణి నెమ్మదిగా అంది. "పిల్లలకు ఒక బ్లాక్‌బోర్డ్ కొని తెచ్చి ఇంట్లో పడేయండి. వాళ్ళు దానిమీదే రాసుకొంటూ ఉంటారు. అలాగే ఓ తాడు కూడాను! ఇద్దరి చేతులూ కట్టి కూర్చోపెడుతుంటాను. ఇంక ఏ అల్లరీ చెయ్యరు వాళ్ళు!"

ఉలిక్కిపడ్డాను. వాణి చాలా బాధపడిందన్నమాట! ఎందుకిలా? నాకు తెలీకనే నేను ఎందుకిలా అవుతున్నాను? పిల్లల అల్లరిని ఎందుకు అర్థం చేసుకోలేక పోతున్నాను? అనుకున్నాను.

ఆరోజు సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు గుర్తున్నా కానీ నేను బ్లాక్‌బోర్డ్ కొని తీసుకువెళ్ళలేదు.

ఆ సంఘటన నాకు బాధకలిగించింది. ఓ విధంగా కనువిప్పులా అయిందేమో!

ఇల్లంతా ఆప్యాయంగా ఇంకోసారి కళ్ళతో తడిమి చూసుకొన్నాను. ఒక మూల కాఫీ ఒలికి ఉంది. ఒకపక్క గోడమీద అంకెలేవో రాసి ఉన్నాయి. మరోపక్క 'ఈ రోజు నుంచీ నీళ్ళవాడుక మొదలు' అని రాసి ఉంది. నిజానికి ఆరోజు నుంచే పాలవాడుక మొదలు!! ఇంకో పక్కగా గోడమీద ఓ చిన్న బొమ్మకోసం కొట్టిన మేకు గుర్తు. ఆ బొమ్మను ఖజురహో వెళ్ళినప్పుడు కొన్నాం!! ప్రతి అంగుళమూ ఏదో కథ చెప్తోంది. ప్రతీ గీతా, రాతా ఏదో సంఘటనను గుర్తు చేస్తోంది. కొన్ని గిలిగింతల్నీ, కొన్ని పులకింతల్నీ కలగచేస్తోంటే, కొన్ని మనసులోని ఏదో తప్పును గుర్తుచేస్తున్నాయి.

ఇన్ని జ్ఞాపకాలను తప్పించుకొని వెళ్ళాలి కాబోలు, అనుకొన్నాను బాధగా. రహీం మళ్లీ హారన్ మోగించాడు.

కదిలాను. బయటకు వచ్చి తాళం వేసి, తాళంచెవి పక్కింటి వాళ్ళకు ఇచ్చాను. వెళ్ళొస్తామని చెప్పి లారీలో ఎక్కాము.

రహీం లారీని స్టార్టు చేసి కొత్తఇంటిదగ్గర ఆపాడు. ముందుదిగి జేబులోంచి తాళంచెవి తీసి ఇంట్లోకి అడుగు పెట్టాను. ఇల్లంతా నిన్న వేసిన సున్నంతో కళకళలాడుతోంది. గోడలన్నీ నీటుగా ఉన్నాయి.

నిన్న ఈ ఇంటికి సున్నం వేయిస్తూ ఇంతక్రితం ఉన్నవాళ్ళను ఎన్ని అనుకొన్నానోగదా. ఇల్లంతా ఇంత ఇదిగా ఉంచారేం అనుకొంటూ! గోడలనిండా అన్నీ గీతలు మరకలు, మేకులు కొట్టిన గుర్తులు. ఒళ్ళు మండింది. ఇల్లు నాశనం చేశారనుకొన్నాను. కానీ తప్పు, అలా తప్పుగా అనుకొన్నందుకు బాధపడ్డాను.

మేం ఖాళీ చేసి వచ్చిన ఇంట్లోకి రేపోమాపో కొత్తవాళ్ళువచ్చి దిగుతారు. ఇల్లంతా చెత్తగా ఉందనుకొని సున్నం కొట్టిస్తారు కాబోలు మా జ్ఞాపకాలు తుడిచివేస్తూ!!

నాకు బాధ కలిగింది. పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయ్యారు ఇప్పుడు ఇంక గోడలమీద రాస్తారో, నాన్న కొడతాడని రాయరో?

పిల్లలు గోడమీద రాయకపోతే ఇప్పటి ఈ సున్నం గోడలా జీవితమూ వెలవెల పోతుందేమో - జ్ఞాపకాల్ని ఉంచక!.... వద్దు, నాకు ఆ శిక్ష వద్దనిపించింది.

వాణి ఇంట్లోకి వస్తూ అడిగింది. "ఏమిటి అలా ఆలోచిస్తున్నారు?"

వాణికి నేనేమీ జవాబు ఇవ్వలేదు. నా దృష్టి అంతా ప్రతిమ చేతిలోని పెన్సిల్‌మీద ఉంది. లారీలోంచిది గాక ఎప్పుడు మొదలుపెట్టిందో, గోడమీద అప్పటికే ఇంగ్లీషులో "పి. ఆర్. ఎ" అంటూ రాస్తోంది.

నా దృష్టి గమనించి వాణి ప్రతిమని కేకలేయబోయింది.

నేను వాణిని వారించాను ఊరుకో, పిల్లలేకదా అన్నట్లు!

జీవితంలో కొత్త ఇల్లు- కొత్త ఆలోచనలకు, కొత్త అనుభూతులకు స్వాగతం చెబుతోంది.

మేం ఇంట్లోకి నడిచాం.

- జ్యోతి, మాసపత్రిక ఫిబ్రవరి, *1981*